ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

సోమవారం 19 ఫిబ్రవరి 2024

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ 7లో..

8లో.. గుమ్మి పుల్లయ్య చేసిన పోరాటం మరువలేనిది



ఎదురు చూపులు

- స్వశక్తి సంఘాలకు నాలుగేళ్లుగా అందని వడ్డీ రాయితీ
- జిల్లాలో గత అర్థిక సంవత్సరంలో రూ. 68.66 కోట్ల బకాయిలు
- ఈ ఆర్థిక సంవత్సరం బ్యాంక్ లింకేజీ రూ 390.01 కోట్లు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మహిళలు స్వశక్తిగా ఎదగడానికి ఆర్థికాభివృద్ధికి పొదుపు సంఘాలు బాటలు వేసినా ప్రభుత్వం నుంచి రావాల్సిన వడ్డీరాయితీ కోసం మహిళ సంఘాల సభ్యులకు నిరీక్షణ తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటి ప్రభుత్వం వరకు వడ్డీరాయితీ విడుదల కాక నాలుగేళ్లు గడిచిపోయింది. సంఘాల్లో తీసుకున్న రుణాలకు సక్రమంగా వాయిదాలు చెల్లిస్తున్నా దానికి సంబంధించిన వడ్డీ రాయితీ కోసం పాలకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి కొనసాగుతూనే ఉంది. కొత్త ప్రభుత్వం వడ్డీరాయితీ ఎప్పుడు విడుదల చేస్తుంది ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుందోననే అయోమయం కూడా నెలకొంది. మరోవైపు రాజన్న సిరిసిల్ల జిల్లాలో వడ్డీ రాయితీ కోసం మహిళ సంఘాలు ఆందోళనకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం కూడా ముగిసిపోతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2020-21 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన వడ్డీ రాయితీ బకాయిలు రూ 68.66 కోట్లకు చేరుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 9,963 స్వశక్తి సంఘాలు, 411 గ్రామ సంఘాలు, 12 మండల సంఘాలు, వీటికి అనుసంధానం చేస్తూ జిల్లా సమాఖ్య కూడా పనిచేస్తుంది. స్వశక్తి సంఘాల పరిధిలో 1,12,637 మంది సభ్యులు ఉన్నారు. వీరికి ప్రతీ సంవత్సరం కోట్లలోనే వడ్డీలేని రుణాలను అందిస్తూ జిల్లాలో గ్రామీణాభివృద్ధి సంస్థ ముందంజలోనే నిలుస్తుంది. స్వశక్తి సంఘాలకు బ్యాంక్ లింకేజీ అందించడంలో ఇబ్బందులు లేకపోయినా వడ్డీ రాయితీ మాత్రమే భారంగా మారింది. ఈ ఆర్థిక సంవత్సరం మినహాయించి 9,755 స్వశక్తి సంఘాలకు రూ. 68.66 కోట్లు వడ్డీ రాయితీ రావాల్సి ఉంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 9,051 సంఘాలకు 20.67 కోట్ల రూపాయల రాయితీ రావాల్సి ఉండగా 2021-22లో 9,001 సంఘాలకు రూ 25.78 కోట్లు, 2022-23 సంవత్సరంలో 9,755 సంఘాలకు రూ 22.21 కోట్లు వడ్డీ రాయితీ రావాల్సి ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వడ్డీ రాయితీ దాదాపు రూ 25 కోట్ల వరకు పెండింగ్‌లో ఉండే అవకాశం ఉంది. వడ్డీ రాయితీ కోసం మహిళలు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం 2014-15నుంచి 2019-20 అర్థిక సంవత్సరానికి సంబంధించి 9,070 సంఘాలకు రూ 41.85 కోట్ల వడ్డీ రాయితీని సంఘాల ఖాతాల్లో జమ చేశారు.

మహిళల్లో నిరాశ..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో బ్యాంక్ లింకేజీ ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సర లక్ష్యం 7,630 సంఘాలకు రూ 443.11 కోట్లు రుణాలు అందించే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 3,570 సంఘాలకు రూ 390.01 కోట్లు అందించారు. స్త్రీనిధి ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ 63.09 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ 32.43 కోట్లు అందించారు. స్త్రీనిధి రుణాల కింద ప్రభుత్వం రూ 12.25 కోట్లు వడ్డీరాయితీని స్వశక్తి సంఘాల ఖాతాల్లో జమ చేశారు. మహిళ పొదుపు సంఘాలకు రుణాలు అందించడంతో పాటు తిరిగి చెల్లించడంలో జిల్లా ఇతర జిల్లాల కంటే ముందు వరుసలో నిలుస్తున్నా వడ్డీ రాయితీ రాకపోవడమే మహిళల్లో నిరాశను మిగిలిస్తుంది.

మండలాల వారీగా రావాల్సిన వడ్డీ రాయితీ ఇలా (లక్షల్లో)

మండలం	2020-21	2021-22	2022-23	సంఘాలు	మొత్తం
బోయినపల్లి	178.99	209.51	177.39	792	575.89
చందుర్తి	131.73	185.57	161.73	712	479.03
ఇల్లంతకుంట	253.56	316.83	278.97	1145	849.36
గంభీరావుపేట	230.93	288.59	285.13	1191	804.65
కోనరావుపేట	152.69	229.63	178.60	1038	560.92
ముస్తాబాద్	276.82	301.01	247.12	1124	824.95
రుద్రంగి	58.91	66.92	68.40	368	194.23
తంగళ్లపల్లి	263.75	300.97	246.70	1145	811.42
వీర్నపల్లి	53.94	72.39	66.55	303	192.88
వేములవాడ	65.09	100.84	86.04	361	251.97
వేములవాడరూరల్	113.13	130.24	118.75	544	362.12
ఎల్లారెడ్డిపేట	277.73	375.63	305.80	1037	959.16
మొత్తం	2067.27	2578.13	2221.18	9755	6866.58

డీపీఆర్వోగా వంగరి శ్రీధర్



సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 18: రాజన్న సిరిసిల్ల పౌర సంబంధాల అధికారిగా వంగరి శ్రీధర్‌ను నియమిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఎం హన్మంతరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో డీపీఆర్వోగా పనిచేస్తున్న మామిండ్ల దశరథంను హైదరాబాద్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా పౌర సంబంధాల అధికారిగా పనిచేస్తున్న వంగరి శ్రీధర్‌ను జిల్లాకు బదిలీ చేశారు.

మేడారం జాతర బందోబస్తుకు 260మంది పోలీసులు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 18: మేడారం జాతర బందోబస్తు కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి 260మంది పోలీసులు ఆదివారం ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పోలీస్ సబ్‌డివిజన్‌ల నుంచి ఒక డీఎస్పీ, ముగ్గురు సీఐలు, ఎనిమిది మంది ఎస్‌ఐలు, పోలీస్ కానిస్టేబుళ్లు, హోంగార్డులు సమ్మక్క, సారలమ్మ జాతరలో బందోబస్తు నిర్వహించడానికి వెళ్లారు. వీరంతా ఈనెల 23వరకు మేడారం జాతరలో విధులు నిర్వహించి తిరిగి జిల్లాకు చేరుకుంటారు.

శ్మశాన వాటిక స్థలం కోసం ధర్నా



దర్నా చేస్తున్న కేసీఆర్ కాలనీ వాసులు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 18: శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్ నగర్ కాలనీ వాసులు ధర్నా చేశారు. ఆదివారం కేసీఆర్ నగర్ ప్రధాన ద్వారం మూసివేసి బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ శ్మశాన వాటిక లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డబుల్ బెడ్‌రూం మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించలేదన్నారు. గతంలో అధికారులు 20 గుంటల స్థలాన్ని శ్మశాన వాటికకు కేటాయించారన్నారు. ప్రస్తుత తహసీల్దార్ స్థలం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారన్నారు. గ్రామపంచాయతీ లేదు.. ఆధార్ కార్డు ఇక్కడ లేవు.. మీరు కేసీఆర్ నగర్ వాసులు కాదంటూ తహసీల్దార్ మమ్మల్ని అవమానిస్తూ మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో గోవిందుల లక్ష్మణ్, శ్రీనివాస్, శ్రీధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సమున్నత స్థానం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 18: క్రీడాకారులకు సమాజంలో సమున్నత స్థానం ఉందని ఎస్సై దాస సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఆదివారం మండలస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు సమయాన్ని వృధా చేయకుండా అటల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. క్రీడల్లో గెలుపుఓటమిలను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రయాణికుల నిరసన



నిరసన తెలుపుతున్న ప్రయాణికులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 18: సిరిసిల్ల పట్టణం మానేరు బ్రిడ్జి వద్ద సిరిసిల్ల-సిద్దిపేట రహదారిపై ఆర్టీసీ బస్సు చెడిపోయి మూడు గంటల సమయం అయినా ప్రత్యామ్నాయంగా ఆర్టీసీ అధికారులు అదనపు బస్సు వేయకపోవడంతో ఇబ్బంది పడిన ప్రయాణికులు ఆదివారం రాత్రి నిరసన తెలిపారు. బస్సులో మహిళలు, చిన్న పిల్లలు ఉండడంతో మూడు గంటల వరకు చాలా ఇబ్బంది పడ్డారు. ప్రయాణికులు అదనపు బస్సు వేసి గమ్యానికి చేర్చాలంటూ రోడ్డుకు అడ్డంగా ప్రయాణికులు నిలిచి నిరసన వ్యక్తం చేయడంతో ఆర్టీసీ అధికారులు స్పందించి మరో బస్సును వేసి ప్రయాణికులను పంపించి వేశారు.

పేదల జీవితాలతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వం

- సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 18: దేశంలోని పేదల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆడుకుంటోందని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని ఓ ఫక్షన్ హాల్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిసుత్తన్న ఆర్థిక, మతతత్వ విధానాల ఫలితంగా ప్రజల జీవనాధాయం పడిపోతూ మరింత పేదలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో రైతాంగ పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తూ రైతులకు లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చిందన్నారు. కానీ నేటికీ వాటిని అమలు చేయలేదన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆరోపించారు. రైతాంగ పోరాటంలో చనిపోయిన 700 మంది రైతుకుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వలేదని మూడు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో రైతు చట్టాలను ఉపసంహరించుకుంటున్నామని చెప్పి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు తలొగ్గి పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచారని ఉపాధిహామీ కార్మికుల కూలీ పెంచడం లేదని ఆరోపించారు. గ్రామాల్లో పనిచేసే కూలీలకు రూ. 500లు ఇస్తున్నారని కేంద్ర గ్రామీణ ఉపాధి కూలీలకు రోజుకు రూ. 600ల కూలిని కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఇవ్వదని ప్రశ్నించారు. ప్రపంచంలోనే భారతదేశంను మూడో ఆర్థిక సంపన్న అభివృద్ధి దేశంగా తీర్చిదిద్దామని చెప్పుకుంటున్న మోదీ గ్రామీణ ఉపాధి కూలీలు గుడిసెల్లో ఉంటూ కూలీ పని చేసుకుంటున్నారన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం బడ్జెట్ పెరుగుతుంది తప్పా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం బడ్జెట్ పెరగడం లేదని ఆరోపించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం బడ్జెట్ తగ్గించడం అంటే పేదవారి జీవితాలతో ఆడుకోవడమేనని అన్నారు. ఉపాధి హామీ కార్మికులకు 200రోజుల పనికల్పిస్తూ 15 రోజులకు ఒక్కసారి వేతనాలు చెల్లించాలని కార్మికుడు చనిపోతే రూ. 10 లక్షలు ఆ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్న నమ్మకం ఉందన్నారు. ప్రజల మౌలిక సదుపాయాలు తీర్చాలని అందులో విద్యా, వైద్యం, గ్రామీణ ఉపాధిహామీ పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలు వచ్చినా ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలపైన ప్రశ్నించాల్సిందేనని అందులో సీపీఐ అనుబంధ సంఘాలు ముందు వరుసలో ఉంటాయన్నారు. నాడు మంత్రిగా కేటీఆర్ రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకురావడం కోసం దేశ, విదేశాలు తిరగాడు తప్పా సిరిసిల్లలోని పేద ప్రజలకు ఇంటి స్థలాలు, ఇంటి నిర్మాణాలకు ఆర్థిక సహాయం చేయలేదని పేద ప్రజలను ఏనాడు పట్టించుకోలేదని మండిపడ్డారు. సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం బాలమహేష్, జిల్లా కార్యదర్శి జంగం అంజన్న, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, మధ్యాహ్న భోజన పథకం జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడ ధర్మేని లక్ష్మణ్, ఉపాధి హామీ పథకం కార్మికులు పాల్గొన్నారు.

రైతులపై రాజకీయాలు చేయవద్దు

- సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్ల మధు



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 18: రైతులపై రాజకీయలు చేయవద్దని సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్ల మధు హితవు పలికారు. ఆదివారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని గతంలో కేటీఆర్ నీళ్లను వదిలిన కాలువ వద్ద అప్పటి ఫొటోలు పట్టుకుని బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లడుతూ రంగనాయకసాగర్ నుంచి మండలానికి నీళ్లు రాలేదని కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. ఈ ప్రాంత రైతుల ప్రయోజనం కోసం కేటీఆర్ అహర్నిశలు శ్రమించి నీళ్లు తెచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వంలో ఉండి నీళ్లు రావడంలేదని మాట్లడడం సిగ్గుచేటన్నారు. గతంలో సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లను సమన్వయం చేస్తూ రైతుల ప్రయోజనాల కోసం మండుటెండల్లో చెరువులను నీటితో నింపిన కేటీఆర్‌ను రైతులు మర్చిపోరన్నారు. మండంలోని చెరువులను నీళ్లతో నింపి కాంగ్రెస్ చిత్తశుద్ధిని నిరుపించుకోవాలని డిమాండ్ చేశారు. కేటీఆర్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొయ్యడ రమేశ్, కొమ్మిటి రాజిరెడ్డి, సతీష్‌రెడ్డి. తిరుపతిరెడ్డి, అనిల్‌రెడ్డి, చిరంజీవి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, ఆర్రోజు, రవి, మల్లయ్య, రాజిరెడ్డి, లక్ష్మీనారయణ, దేవరాజ్, శ్రీనివాస్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పెంటి వాగుపై బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో?



కొండాపూర్ వద్ద బ్రిడ్జికి చేపట్టిన తాత్కాలిక మరమ్మతులు



వర్షాకాలంలో బ్రిడ్జిపై ఉప్పొంగుతున్న వరద ఉధృతి (ఫైల్)

కోనరావుపేట, ఫిబ్రవరి 18: మండలంలోని కొండాపూర్ స్టేజీ వద్ద ఉన్న పెంటి వాగుపై ప్రజాప్రతినిధులు బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రజలకు ఇబ్బంది తొలగిస్తామని చెప్పుతున్నప్పటికీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో కలగానే మిగిలిపోతుంది. ప్రతీ సంవత్సరం బ్రిడ్జి కొట్టుకుపోయి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పెంటివాగు బ్రిడ్జి పెంటి వాగు ఉధృతికి మూడు సంవత్సరాల క్రితం కొట్టుకుపోయింది. అప్పటి నుంచి తాత్కాలిక మరమ్మతు చేపట్టి వదిలి వేయడంతో ప్రతీ సంవత్సరం వరద తాకిడికి తాత్కాలికంగా చేపట్టిన మరమ్మతులు కొట్టుకుపోతున్నాయి. సిరిసిల్ల నుంచి వెంకట్రావుపేట, కొండాపూర్, నిమ్మపల్లి మీదుగా సిరికొండ వరకు వెళ్లే ఈ ప్రధాన రహదారిలో కొండాపూర్ వద్ద పెంటివాగు బ్రిడ్జి నిర్మాణం శాశ్వత పరిష్కారం కోసం నిధులు మంజూరు చేసి నిర్మించకపోవడంతో ప్రతి సంవత్సరం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత ప్రభుత్వం 50 కోట్లు మంజూరు చేశామని చెప్పుతున్నప్పటికీ ఏ పరిష్కారం కనిపించలేదు. ఎప్పుడు రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారి పెంటి వాగు బ్రిడ్జి లేకపోవడం వల్ల భారీ వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ పెంటి వాగుపై మూడు కల్వర్టులు ఉన్నాయి. కోనరావుపేట నిమ్మపల్లి వరకు ఒక బ్రిడ్జి, సిరిసిల్ల నుంచి నిమ్మపల్లి ప్రధాన రహదారి కొండాపూర్ వద్ద ఒక బ్రిడ్జి, నిజామాబాద్ నుంచి వెంకట్రావుపేట మీదుగా నిమ్మపల్లి వెళ్లే పెంటివాగు బ్రిడ్జి వెంకటరావుపేట-నిజామాబాద్ మధ్యలో ఉంటుంది. ఈ మూడు బ్రిడ్జిలు కొట్టుకపోవటం వల్ల ప్రతీ సంవత్సరం ఇబ్బందులు పడుతున్నారు. నిజామాబాద్ -వెంకట్రావుపేట మధ్యలో పెంటి వాగు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ పిల్లర్లు పోసి సదరు కాంట్రాక్టర్ వదిలేశాడు. ఈ బ్రిడ్జిలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి అధికారులు, పాలకులు వదిలేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించి బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

వనరులను దోచుకోవడం కోసమే సిరిసిల్లకు కేటీఆర్

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 18: సిరిసిల్ల ప్రాంతంలోని వనరులను దోచుకోవడం కోసమే కేటీఆర్ ఇక్కడికి వచ్చాడని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి కులాల ప్రాతిపదికన వారికి రావల్సిన వాటాలను ఇస్తామని ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారన్నారు. అందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టి అమోదింప జేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు. 15 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కేటీఆర్ మొన్న శాసన సభలో సిరిసిల్ల ప్రాంతాన్ని సర్వతోముఖాభివృద్ధి చేశానని చెప్పారన్నారు. కానీసిరిసిల్ల ప్రాంతలో ఇరిగేషన్ వ్యవస్థ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందగా ఉందన్నారు. ఈ ప్రాంతానికి రావల్సిన కాళ్లేశ్వరం నీళ్లు రాలేదని ఆరోపించారు. సమైక్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుతో ఎగువమానేరును నింపడానికి పథకాలను రూపొందించారని అన్నారు. దాన్ని కేసీఆర్ రీడిజైన్ల పేరిట కాళ్లేశ్వరం ప్రాజెక్టు నుంచి తీసుకొస్తామంటూ దాని అంచనాలను పెంచిన కూడా 9వ ప్యాకేజీ నుంచి సింగ సముద్రం నుంచి ఎగువమానేరుకు నీళ్లు రాలేవని ఆరోపించారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యమానేరు ప్రాజెక్టును దాదాపు 70 శాతం పనులను పూర్తి చేసిందన్నారు. ఎన్నికలు వస్తున్నాయని మల్కపేట రిజర్వాయర్‌లో ఒక్క టీఎంసీ నీళ్లు నిప్పాడని అన్నారు. ఒక్క టీఎంసీ నీళ్లు నింపినంత మాత్రాన 9వ ప్యాకేజీ కింద సాగు కావల్సిన భూములకు నీళ్లు వస్తున్నాయా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. 9వ ప్యాకేజీలోని సింగసముద్రం, పేనెమడుగు, ఎగువ మానేరుకు కావల్సిన కాలువలు ఇప్పటికి పూర్తి అయిన పాపాన పోలేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యుడ నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు, వెల్ముల స్వరూప,మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి సత్యనారాయణ,నాయకులు వైద్య శివప్రసాద్, ఎండీ ఖాజా, బూట్ల నవీన్, వెల్ముల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల డీఎస్పీగా భీమా శర్మ

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 18: సిరిసిల్ల డీఎస్పీగా ఆర్ భీమా శర్మను నియమిస్తూ డీజీపీ రవిగుప్తా ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. సిరిసిల్ల డీఎస్పీగా పనిచేస్తున్న ఎన్ ఉదయ్‌రెడ్డిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీగా బదిలీచేశారు. వరంగల్‌లో ఎస్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న భీమా శర్మకు సిరిసిల్లకు పోస్టింగ్ ఇచ్చారు.

సిరిసిల్ల ఎంవీఐగా శోభన్‌బాబు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 18: సిరిసిల్ల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా శోభన్‌బాబును నియమిస్తూ రవాణాశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సిరిసిల్ల ఆర్టీవోగా పనిచేసిన వై కొండల్‌రావును హుస్నాబాద్‌కు బదిలీ చేయగా సిరిసిల్ల ఎంవీఐగా పనిచేసిన ఏ కిశోర్‌చంద్రారెడ్డిని మంచిర్యాలకు బదిలీచేశారు. ఏఎంవీఐగా బి రజనీదేవిని సిరిసిల్లకు బదిలీ చేశారు. బోధన్ నుంచి సిరిసిల్లకు బదిలీపై వస్తున్న శోభన్‌బాబుది కోనారవుపేట మండలంలోని బావుసాయిపేట గ్రామం కావడం గమనార్హం.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 18: కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రం నుంచి గంగారంకు వెళ్లే దారిలో ఆదివారం టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన మల్లయ్య అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై పడి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో కాల్వ శ్రీరాంపూర్ నుంచి కారులో పెద్దపల్లికి వెళ్తున్న మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ తలకు గాయమైన మల్లయ్యను తన డ్రైవర్ సహాయంతో కారులో ఎక్కించుకుని కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం బాధితుడి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ ఓంకార్‌యాదవ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మల్లయ్యకు మెరుగైన వైద్య చికిత్స కోసం పెద్దపల్లికి తరలించారు. మల్లయ్యను సకాలంలో ఆసుప త్రికి తీసుకు రావడం పట్ల అతని కుటుంబ సభ్యులు సారయ్యగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

గంభీరావుపేట, ఫిబ్రవరి 18: గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో జగిత్యాల జిల్లా పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆదివారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. గ్రామీణ వ్యవస్థాపక అవగాహన అభివృద్ధి యోజన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కార్యక్రమాన్ని చేపట్టారు. రైతులు సాగు చేస్తున్న పంటల విధానం, దిగుబడి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సామాజిక వనరులు, సమస్యల చెట్టు, కాలానుగున పటం తదితర అంశాలపై ముగ్గులతో చిత్రాలు వేసి రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో గౌతమి, సాయి తేజ, అజయ్, మాజీ సర్పంచ్ సరళ రాజనర్సింహరెడ్డి, నాయకులు సేనరెడ్డి, రాజు, శ్రీనివాస్, నరసింహ పొలాస విద్యార్థులు ఉన్నారు.


కొత్తపల్లిలో అవగాహన కల్పిస్తున్న పొలాస విద్యార్థులు

జాతీయ స్థాయి ఉత్సవాలకు చిల్వకోడూర్ విద్యార్థులు


జాతీయ స్థాయి ఉత్సవాలకు ఎంపికైన విద్యార్థులు

గొల్లపల్లి, ఫిబ్రవరి 18 : నేటి నుంచి ఢిల్లీలో జరగనున్న కబ్, బుల్ బుల్ ఉత్సవాలకు గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులు ఆదివారం దేశ రాజధానికి తరలివెళ్లారు. ప్రతి యేటా జాతీయ స్థాయిలో కబ్, బుల్ బుల్ ఉత్సవాలను కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. మూడు ఏళ్లుగా కరోనా మహమ్మారి కారణంగా ఉత్సవాలను నిర్వహించలేదు. ఈ యేడు నిర్వహిస్తుండడంతో తెలంగాణ రాష్ట్రం తరపున చిల్వకోడూర్ విద్యార్థులు ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆహ్వానం అందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్. అరుణ తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల విద్యార్థులు పాల్గొనే ఈ ఉత్సవాలకు మన రాష్ట్రం తరపున మా విద్యార్థులు ఎంపికవడం గర్వకారణంగా ఉందని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన గట్ల అభినవ్, కూన సాయి, బద్రి అనిరుద్, సికినికాంతం శివసాయి, గౌడికర్ రుత్విక్, ఒల్లాల రుషి అనే విద్యార్థులు కబ్ బుల్ బుల్ ఉత్సవాలకు ఎంపికయ్యారు. కబ్ గ్రీటింగ్, జంగిల్ ప్లే, బాలుర నృత్యం, ఉత్సవ్ మేళా తదితర అంశాల్లో ఎంపికైన విద్యార్థులకు కబ్ మాస్టర్ వినోద్ గౌడ్ శిక్షణ ఇచ్చినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

కుక్కల దాడిలో 28 గొర్రెలు మృతి

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 18: జగిత్యాల మండలం మోతె గ్రామంలో ఆదివారం కుక్కలు గొర్రెలపై దాడి చేసి గాయపర్చిన సంఘటనలో 28 గొర్రెలు మృతి చెందాయి. అలాగే జగిత్యాల రూరల్ మండలంలోని హన్మాజీపేట గ్రామంలో గతంలో కుక్కలు పశువులపై దాడిచేయడంతో పశువులు మృతిచెందిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో కుక్కల బెడద అధికమైంది. రద్దీకూడళ్లు, రోడ్ల వెంట కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడులకు దిగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఏదోఒకచోట నిత్యం కుక్కకాటు బాధితులు ఉంటున్నారు.


మృతిచెందిన గొర్రెలు

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 18: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో అనారోగ్యంతో గుండం రాజు(32) అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా అంబారిపేట గ్రామానికి చెందిన గుండం రాజు మూడు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకుని ఇందిరమ్మకాలనీలో జీవిస్తున్నాడు. రెండు సంవత్సరాల క్రితం ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లగా అనారోగ్యం బారిన పడి ఏడు నెలల క్రితం స్వదేశానికి తిరిగి వచ్చాడు. అనారోగ్యంతో పనిచేయలేని పరిస్థితిలో తీవ్ర మనస్తాపానికి గురైన రాజు ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా : ముగ్గురికి గాయాలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 18: సిరిసిల్ల పట్టణం బైపాస్ రహదారి కల్వర్టుపై అతివేగంగా వెళ్తున్న ఓ కారు బోల్తా పడింది. ఆదివారం రాత్రి రగుడు బైపాస్ నుంచి వెంకటాపూర్ వైపు ముగ్గురు ప్రయాణికులతో కారు అతి వేగంగా వెలుతూ డ్రైవర్ బ్రేకు వేయడంతో కల్వర్టు వద్ద మూడు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని టౌన్ ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సారెస్పీ డీ-53 ఉప కాలువ కబ్జా

గొల్లపల్లి, ఫిబ్రవరి 18: గొల్లపల్లి మండలం బొంకూర్ రెవెన్యూ శివారులోని ఎస్సారెస్పీ డీ-53 ఉప కాలువను కొందరు రైతులు పూడ్చి వేయడంతో ఆయకట్టు కింది రైతుల పంట పొలాలకు సాగు నీరందడం లేదు. ఆరుగాళం చమటోడ్చి సాగు చేసిన పంట పొలాలకు సాగు నీరందక కళ్లేదుటే ఎండి పోతుండడంతో బాధిత రైతాంగం ఆందోళన చెందుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బొంకూర్ గ్రామ రెవెన్యూ శివారులో ఎస్సారెస్పీ డీ-53 కాలువ కింద ఆయకట్టు కింది రైతుల పంట భూములకు సాగు నీరందించేందుకు దశాబ్దాల క్రితం ఉప కాలువ (పిల్ల కాలువ)ను రైతుల పంట భూముల్లోంచి నిర్మించారు. అయితే, ఇటీవల కాలంలో కొందరు రైతులు ఉప కాలువను చదును చేసి కబ్జా చేయడంతో ప్రస్తుతం అక్కడ ఉప కాలువ నామరూపాల్లేకుండా పోయింది. అక్కడక్కడ కొందరు రైతులు కాలువను ముట్టుకోకుండా ఉంచగా, అందులో పిచ్చి మొక్కలు పెరిగి, బండరాళ్లు పడి అస్తవ్యస్తంగా తయారై కింది పంట భూములకు సాగు నీరందని దుస్థితి నెలకొంది. కొందరు రైతులు కాలువను పూడ్చివేసి యథేచ్ఛగా పంటలను సాగు చేస్తున్నారు. సుమారు 80 ఎకరాలకు సాగు నీరందించేందుకు ఈ ఉప కాలువను ఏర్పాటు చేసినట్లు రైతులు పేర్కొంటున్నారు. అయితే, మీది రైతులు కాలువను కబ్జా చేయడంతో ఆయకట్టు కింది రైతుల పంటల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. అసలే, ఎస్సారెస్పీ డీ-53 చివరి ఆయకట్టుకు సాగు నీరు ఎప్పుడొస్తదో తెలియని పరిస్థితుల్లో ఆయకట్టు కింది చివరి పంట భూములకు సాగు నీరందక రైతులు తల్లడిల్లుతున్నారు. దీనిపై గతంలో జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని పలువురు బాధిత రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా ఆడిషనల్ కలెక్టర్ ఉప కాలువను పునరుద్ధరించాలని ఇచ్చిన ఆదేశాలను సైతం బేఖాతరు చేసినప్పటికీ సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి ఉప కాలువను పునరుద్ధరించి ఆయకట్టు కింది పంట పొలాలకు సాగు నీరందించాలని బాధిత రైతాంగం కోరుతున్నారు.



డీ-53 కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



పూర్తిగా తొలగించిన ఉప కాలువ

సాగు నీరందక పంటలు ఎండిపోతున్నాయి
- మాదాసు కార్తీక్, యువరైతు, బొంకూర్

ఎస్సారెస్పీ డీ-53 ఉప కాలువ కింద 8 ఎకరాల సాగు భూమి ఉంది. ఎస్సారెస్పీ సాగునీటిని నమ్ముకుని పంటలు సాగు చేస్తున్నాం. ఎగువ ప్రాంతంలో ఉన్న కొందరు రైతులు ఉప కాలువను పూర్తిగా పూడ్చి వేసి కాలువను కబ్జా చేశారు. దీంతో తమ పంట పొలాలకు సాగు నీరందక ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి సాగు చేసిన పంటపొలాలు ఎండిపోయే ప్రమాదం పొంచిఉంది. దీనిపై గతంలో పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆరుగాళం కష్టించి సాగు చేసిన పంట చేతికందకుండా పోతే తమ కుటుంబాలు పస్తులుండాల్సిందే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి ఉప కాలువను పునరుద్ధరించి పంటపొలాలకు సాగు నీరందించాలి.

మా దృష్టికి రాలేదు
-మహేష్, ఎస్సారెస్పీ ఏఈ

ఎస్సారెస్పీ డీ-53 ఉప కాలువ కబ్జాకు గురైనట్లు తమ దృష్టికి రాలేదు. ఆయకట్టు కింది చివరి పంట భూములకు సాగు నీరందించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎస్సారెస్పీ కాలువలను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటివరకు మండలంలోని అబ్బాపూర్ - లొత్తునూర్ గ్రామాల మధ్య ఉన్న డీ-53 కాలువ గూర్చి ఫిర్యాదులు అందినవి. బాధిత రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దానిని క్షేత్రస్థాయిలో పరిశీలించాం. అయితే, అక్కడ వరి పంట వేయడం వల్ల పరిష్కారానికి కొంత సమయం పడుతుంది. యాసంగి వరి పంటల కోతలు పూర్తి కాగానే సమస్యను పూర్తిగా పరిష్కారిస్తాం.

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 18: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు ముందు శ్రీ రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకునే ఆనవాయితీ ప్రకారం ఆదివారం పెద్దసంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అధిక రద్దీ కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి శీఘ్ర దర్శనం అమలు చేస్తున్నారు. బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. భారీ సంఖ్యలో భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గత వారంతో పోలిస్తే భక్తుల సంఖ్య స్వల్పంగా తగ్గినప్పటికీ స్వామివారి దర్శనం త్వరగా జరగడానికి వీలుగా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టారు.



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

రాజన్న సేవలో సంగారెడ్డి ఎస్పీ

వేములవాడ: రాజరాజేశ్వరస్వామి వారిని సంగారెడ్డి జిల్లా ఎస్పీ సి. రూపేష్ దర్శించుకున్నారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు బి తిరుపతిరావు, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్, సీఐ కరుణాకర్, ఎస్ఐ దిలీప్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోనరావుపేట, ఫిబ్రవరి 18 : కోనరావుపేట మండలం సుద్దాల గ్రామాశివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదరికి గాయాలు అయ్యాయి. వివరాల ప్రకారం కనగర్తి గ్రామానికి చేందిన కాదాసు వేణు అదే గ్రామానికి చేందిన మరో వ్యక్తి వేములవాడ నుండి తన ద్విచక్ర వాహనంపై కనగర్తి గ్రామానికి వస్తుండగా సుద్దాల గ్రామ శివారలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సుద్దాల నుండి ఎదురుగా వస్తున్న కారు బైకును డీ కోట్టి వేల్లి పోయింది. దీంతో ఇద్దరి కిందపడి పోగ కాదాసు వేణుకు కాలు విరుగగా మరోకరికి గాయాలు అయ్యాయి. విరి ఇ ద్దరిని 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల జిల్లా అస్పత్రికి తరలించారు.

ప్రయాణికురాలి బ్యాగు నుంచి రూ. లక్ష మాయం

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 18: సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఓ ప్రయాణికురాలి నుంచి లక్ష రూపాయలు మాయమైన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. కోనరావుపేట మండలంలోని మల్కాపేట గ్రామానికి చెందిన లిఖిత ఓ బ్యాగులో లక్ష రూపాయలు పెట్టుకొని ముస్తాబాద్‌లోని ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు ఇంటి వద్దనే ఆటో ఎక్కింది. సిరిసిల్లలోని పాత బస్టాండ్‌కు చేరుకొని ముస్తాబాద్ వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సు ఎక్కిన కొంతసేపటికి ఆమె బ్యాగ్ చూసుకుంది. అందులో ఉన్న లక్ష రూపాయలు మాయం అయ్యాయి. ఇంతకీ ఆ రూ. లక్ష బస్సులో ఎక్కేటపుడు ఎవరైనా కొట్టేశారా, ఆటోలో వచ్చేటపుడే ఎవరైనా తీసుకున్నారా అనేది ప్రయాణికురాలికి తెలియడం లేదు. దీంతో బస్సు దిగి పోలీసులకు సమాచారం ఇచ్చింది. టౌన్ సీఐ రఘుపతి, టౌన్ ఎస్ఐ శ్రీనివాసరావు పాతబస్టాండ్ చేరుకొని ఆర్టీసీ బస్సును తనిఖీ చేశారు. దీంతో ఆ బస్సు దాదాపు అరగంట ఆగిపోయింది. ఆ తర్వాత ఆటోలో వచ్చిన ప్రయాణికుల వివరాలను సేకరించారు. ఎక్కడా ఆ డబ్బుల జాడలేదు. చివరికి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

చెట్టు పైనుంచి పడి ఒకరి మృతి

ధర్మారం, ఫిబ్రవరి18: ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన పీసు రఘునందన్‌రెడ్డి(65) ఆదివారం ఉదయం చెట్టుపై నుంచి పడి ప్రమాదవశాత్తు కాలు జారి మృతిచెందాడు. రఘనందన్‌రెడ్డి చింతకాయలు తెంపడానికి చెట్టు పైకి ఎక్కాడు. చింతకాయలు తెంపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు రవీందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

ప్రమాదకరంగా రహదారులు



ప్రమాదకరంగా ఉన్న రహదారి

రాయికల్, ఫిబ్రవరి 18: రాయికల్ మండలంలో రహదారులు ప్రమాదకరంగా మారాయి. రాయికల్ నుంచి కోరుట్ల వెళ్లే రహదారిలో మైతాపూర్ బస్టాండ్ వద్ద గతంలో వర్షాలధాటికి ఆర్ అండ్ బీ రోడ్డుకు పోసిన మట్టి కొట్టుకపోయింది. దీంతో వాహనదారులు భయం గుప్పిట్లో ప్రయాణిస్తున్నారు. రాత్రి పూట సమయంలో వెళ్లే వాహనదారులు ఏమాత్రం పట్టు కోల్పోయినా ప్రాణాలకే నష్టం కలుగుతుంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డుకు ఇరువైపులా మట్టి పోసి భద్రత కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. రోడ్లు బాగు చేసి ప్ర

ఐఐటీ సదస్సుకు ముగ్గురు ఎస్జీటీలు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 18: గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్ ఐఐటీలో ఈనెల 21 నుంచి జరగనున్న వర్క్‌షాప్‌లో జిల్లా నుంచి ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లు పాల్గొనబోతున్నారు. సెంటర్ ఫర్ క్రియేటివ్ లెర్నింగ్ సిసిఎల్ ఆధ్వర్యంలో మూడు విడతలుగా ఈ కార్యశాల నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన కర్రే ప్రవీణ్, జూలపల్లి మండలానికి చెందిన నల్ల రాజేందర్ రెడ్డి, పాలకుర్తి మండలానికి చెందిన సిహెచ్ కుమార్‌లు ఈ వర్క్ షాప్‌లో పాల్గొంటారని జిల్లా విద్యాధికారి కార్యాలయ వర్గాలు వెల్లడించారు. గతవారం గణితం టీచర్లు వర్క్‌షాప్‌లో పాల్గొనగా మార్చి మొదటి వారంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు ఐఐటీ గాంధీనగర్ కార్యశాలలో పాల్గొననున్నారు. కాగా ఈ నెల 21 నుంచి ఆంగ్ల భాష ఉపాధ్యాయులు జిల్లాకు చెందిన ముగ్గురు ఎస్జీటీలను ఎంపిక చేసి పంపుతున్నట్లు వారు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న కాలనీవాసులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 18: సిరిసిల్ల పట్టణం మానేరు వాగులో నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అయ్యప్ప కాలనీవాసులు ఆదివారం అడ్డుకున్నారు. అనంతరం సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు, ట్రాక్టర్ యజమానాలతో అయ్యప్ప కాలనీ వాసులు వాగ్వాదం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ సిరిసిల్ల అయ్యప్ప కాలనీ నుంచి ఇసుక ట్రాక్టర్లు వెల్లడంతో రోడ్లు చెడిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పట్టణ పోలీసులు, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కాలనీ వాసులందరం కలిసి ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నామన్నారు. జేసీబీతో రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లు వెల్లకుండా గోతి తీయడానికి యత్నించడంతో పోలీసులు, ట్రాక్టర్ల యజమానులు అడ్డుకున్నారు. తమ వీధుల నుంచి వందల సంఖ్యలో ట్రాక్టర్లు వెల్తుండడంతో పిల్లలు పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని, దుమ్ము లేవడంతో తరుచూ అనారోగ్యాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ట్రాక్టర్ యజమానులను నిలదీశారు. స్థానిక అవసరాల కోసం తాము ఇసుక అనుమతులతో తీసుకెల్తున్నామని ట్రాక్టర్ యజమానులు కాలనీవాసులకు తెలిపారు. రోడ్లు చెడిపోతే రోడ్ల గుంతలను పూడుస్తామన్నారు. అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దు మనిగింది.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి



రమేష్‌గౌడ్(ఫైల్)

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 18: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందనే మనోవేదనతో కరీంనగర్ జిల్లా కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పూదరి రమేష్‌గౌడ్ (40) గుండెపోటుతో ఆదివారం మృతిచెందాడు. రమేష్‌గౌడ్ 16 సంవత్సరాలుగా ఆటోను నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా ఆటోలో గిరాకీ లేక కుటుంబాన్ని ఎలా పోషించేదని, నెల వారి ఈఎంఐలు ఎలా కట్టేదని తీవ్ర వేదనకు గురయ్యాడు. ఆదివారం ఛాతిలో నొప్పి వస్తుందని కుప్ప కూలిపోగా, వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. ఆటో డ్రైవర్ కుటుంబానికి ప్రభుత్వం పది లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు.

ఇండియా కూటమి నినాదం 'బీజేపీకి హఠావో.. దేశ్‌కి బచావో..'

- మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించి కేసీఆర్ మొదటి తప్పు చేశాడు
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 18 : వామపక్షాలు, ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తులు లౌకికశక్తులతో కలసి 'బీజేపీకి హటావో దేశ్‌కి బచ్చావో' నినాదంతో ఇండియా కూటమి ప్రజల వద్దకు వెళ్తుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెంకటరెడ్డి మాట్లాడారు. బీజేపీ, ఎండీఏ కూటమిని ఓడించడానికి ఇండియా కూటమిలోని కాంగ్రెస్ పార్టీ అందరని కలుపుకొని పోవాలని లేకుంటే కాంగ్రెస్‌కే నష్టమన్నారు. సాగునీటి చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలి, రైతులకు మద్ధతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరోనాతో కనీస సౌకర్యాలు లేక దేశ వ్యాప్తంగా దాదాపు 20 కోట్ల కార్మికులు పొట్ట చేత్తోపట్టుకొని వలసలు వెల్తున్నారని అన్నారు. వ్యవసాయదారులు, కార్మికులను కేంద్ర ప్రభుత్వం బజారు పాలు చేస్తుందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ధరలను పెంచి సామాన్యుడి నడ్డివిరుస్తున్న నరేంద్ర మోది ప్రభుత్వం మరోసారి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. మోది ప్రభుత్వం బాలరామున్ని తీసుకొచ్చి రామరాజ్యం అంటుందన్నారు. రామ రాజ్యం అంటే డ్రోన్ల ద్వారా రైతులపై భాష్పవాయువు ప్రయోగించడమా, లాఠీ చార్జీ చేయడం అన్ని ప్రశ్నించారు. రాముడు తండ్రికి ఇచ్చిన మాటకు కట్టుబడి అరణ్యవాసం చేశాడు. నరేంద్ర మోదీ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి లేదు



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

అన్ని అబద్దాలేనని అమలు కాని మాట్లాలేనని ఆరోపించారు. మతోన్మాదం తీసుకొచ్చి మరోసారి ప్రజాస్వామ్యంను కూనీ చేయడానికి ప్రయత్నిస్తే మీ నాటకాలు సాగవని హెచ్చరించారు. మొదటి నుండి శ్రీరాంసాగర్ వరదకాలువ, ఎగువమానేరు వచ్చే వరదకాలువలు ఎందుకు కాలేదని ప్రశ్నిం చారు. మీ అధికారంతో ఇష్టానుసారంగా మీ ప్రాంతాలలో పనులను చేసుకు న్నారని ప్రభుత్వ నిధులను వాడుకున్నారని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యాదర్శి పంతం రవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం బాలమహేష్, జంగం అంజన్న, అజ్జ వేణు ఉన్నారు.

తాండ్ర్యాలలో పశువుల కొట్టం దగ్ధం

కథలాపూర్, ఫిబ్రవరి 18: మండలంలోని తాండ్ర్యాలలో ఆదివారం మధ్యాహ్నం బద్దం గంగారెడ్డి అనే రైతుకు చెందిన పశువుల కొట్టం దగ్ధమైంది. మంటలు చెలరేగడంతో గ్రామస్థులు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేశారు. తదనంతరం ఫైర్ ఇంజిన్ రావడంతో సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారనే అనుమానాలు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కొట్టంలో ఉన్న పశుగ్రాసంతో పాటు విలువైన టేకు దుంగలు, ఇతరత్రా వ్యవసాయ సంబంధిత వస్తువులు కాలి బూడిదయ్యాయి. మధ్యాహ్నం వేళ కావడం వల్ల పశువులు కొట్టం లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బాధిత రైతు కుటుంబం రోదిస్తోంది. ఈ ఘటనలో సుమారు రూ.6 లక్షల ఆస్తి నష్టం జరిగిందని రైతులు తెలిపారు.



తాండ్ర్యాలలో దగ్ధమైన పశువుల కొట్టం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మల్యాల, ఫిబ్రవరి 18: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు ఆదివారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గొల్లపల్లెకు చెందిన పెరుగు శేఖర్(25)అనే యువకుడు శనివారం రాత్రి జగిత్యాల నుంచి వస్తుండగా రాజారం వద్ద శేఖర్ ద్విచక్రవాహనం, మరో ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. దీంతో శేఖర్ తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కరీంనగర్ తీసుకెళ్లగా ఆదివారం వేకువజామున చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీసీల చిరకాల వాంఛను నెరవేరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు



స్వీట్లను తినిపిస్తున్న బీసీ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 18: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం దశాబ్దాల బీసీల చిరకాల వాంఛను నెరవేరుస్తుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు అన్నారు. బీసీల కులగణను చేపట్టాలని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి ఆమోదించడంతో ఆదివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు స్వీట్లను తినిపిస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో పర్శ హన్మండ్లు మాట్లాడుతూ బీసీల కులగణనతో బీసీలకు రాజ్యాధికారం సాకారం అవుతుందన్నారు. తెలంగాణ శాసనసభలో బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వం పక్షాన బీసీ కులగణను చేపట్టాలని తీర్మానం ప్రవేశపెట్టడం గొప్ప విషయం అన్నారు. సామాజిక న్యాయం జరగాలంటే బీసీ కులగణన జరిగి తీరాల్సిందేనన్నారు. కులగణన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశానికి బీసీ ప్రధానమంత్రి 10 సంవత్సరాలుగా కొనసాగుతున్నా ఇంతవరకు కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయలేదని, చట్టసభలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించలేదన్నారు. జనాభా ప్రాతిపదికన ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక రాజకీయ రంగాల్లో వాటా కల్పించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గోనె ఎల్లప్ప, తడుక కమలాకర్, సామల తిరుపతి, నల్ల శ్రీకాంత్, గాజుల సాగర్, అన్నల్‌దాస్ భాను, అల్లె బాలరాజు, మార్గం లక్ష్మన్, దొంత రవి, బచ్చు ప్రసాద్, దువ్వాశి కొండయ్య, చిందం శ్రీధర్, బిట్ల రాఘవులు, వెంగళ ప్రమోద్, తిరుపతి పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీకి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 18: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని మాజీ జడ్పీటీసీ ఏలూరి రాజయ్య సోదరుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. నాయకులు సాహెబ్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

శ్మశాన వాటిక నిర్మాణానికి వినతి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 18: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో రెండు శ్మశాన వాటిక నిర్మాణాలతో పాటు అసంపూర్తిగా మిగిలిన వైకుంఠధామంలో వసతులు కల్పించాలని కోరుతూ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఎల్లారెడ్డిపేటకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఆయన స్వగృహంలో కలిసి విన్నవించారు. వైకుంఠధామాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కరెంటు, నీటి సౌకర్యం కల్పించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని విన్నవించారు. స్పందించిన శ్రీనివాస్ నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. నాయకులు బాలరాజుయాదవ్, సంతోష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆయిల్ పామ్ తోటల సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న ప్యాక్స్ పాలక వర్గం సభ్యులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 18: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ ప్యాక్స్ పాలక వర్గం సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా భీమడోలులో అయిల్ పామ్ తోటలను ఆదివారం సందర్శించారు. పంటల సాగు విధానం, దిగుబడి, కొనుగోలు, లాభాలను అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్‌చైర్మన్ కృష్ణమూర్తి, డైరెక్టర్లు లక్ష్మణ్, నారాయణ, సంతోష్‌రెడ్డి, సత్యారెడ్డి, శ్రీరాంనాయక్, నరహరి, శ్రీనివాస్, సీఈవో శశివర్ధన్‌గౌడ్, సిబ్బంది శ్రీకాంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 18: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్‌దాస్‌పేట ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ తదితర కార్యక్రమాలను జరిపించారు. భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు గంప నాగేంద్రం, మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్, సత్యనారాయణ, వేణు, రాము, శ్రీనివాస్, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 18: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం పేర్కొన్నారు. రూ.50 లక్షల దేవాదాయ శాఖ నిధులతో ఆలయాన్ని నిర్మించి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా పురాతన విగ్రహాలను కదలింపునకు అంకుర్పారణ చేశారు. ఈ నెల 20 నుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అఫెరాసుల్తానా, మాజీ సర్పంచ్ నర్సయ్య, నాయబ్ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, నాయకులు మహేందర్, సుధాకర్‌రెడ్డి, నర్సయ్య, కిషన్‌రెడ్డి, హనుమండ్లు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షుడిగా తిరుపతి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 18: మండల విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘ అధ్యక్షుడుగా దేశరాజు తిరుపతి ఎన్నికయ్యారు. మండలకేంద్రంలో ఆదివారం సమావేశం జరిగింది. ఉపాధ్యక్షులుగా తిప్పారపు శ్రీనివాస్, కోడిముంజ రవి, ప్రధానకార్యదర్శిగా కోడిముంజ తిరుపతి, కోశాధికారిగా తిప్పారపు సురేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా కొత్తపల్లి విఠల్, సలహాదారులుగా తిప్పారపు హన్మాండ్లు, మొగిలోజు వెంకటాచారిలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు..

పుస్తెమట్టెలు అందజేత

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని నిరుపేద దంపతులు ఏర్పుల పద్మ- బాలయ్య కూతురు ప్రవణ్య వివాహానికి స్థానిక మాజీ సర్పంచ్, సామాజిక కార్యకర్త నేవూరి మమతా-వెంకట్‌రెడ్డి సమకూర్చిన పుస్తెమట్టెలు, 50 కిలోల బియ్యం స్థానిక నాయకులు ఆదివారం అందజేశారు. నిరుపేద కుటుంబ పరిస్థితిని తెలుసుకుని ముందుకు వచ్చిన మాజీ సర్పంచ్, సామాజిక కార్యకర్త నేవూరి మమతా-వెంకట్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, రాజిరెడ్డి, బాబు, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, జితేందర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం మండల కార్యవర్గం

చందుర్తి, ఫిబ్రవరి 18: చందుర్తి మండల రెడ్డి సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా దూది శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా పూడూరి ప్రశాంత్‌రెడ్డి, నల్ల ఆనందరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏ రాజిరెడ్డి, కోశాధికారిగా దారం బాల్‌రెడ్డి, సలహాదారుగా దారం హనుమంతరెడ్డి, కార్యవర్గ సభ్యులు కాసారపు శ్రీనివాసరెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, బాణాల రవీందర్‌రెడ్డి, దారం రాజభూపాల్ రెడ్డి, బాణాల లచ్చిరెడ్డి, చింతపల్లి తిరుపతిరెడ్డి, ఎల్లోల్ల నరసింహారెడ్డి, అనుపాటి రామ్‌రెడ్డి, దొంతుల మహేందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.



రెడ్డి సంఘం కార్యవర్గ సభ్యులు

నర్మాలలో తైవాన్ జామ

- సేంద్రియ పద్ధతిలో సాగు

- ఆదర్శంగా నిలుస్తున్న యువ రైతు

గంభీరావుపేట, ఫిబ్రవరి 18: గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన ఓ యువ రైతు తైవాన్ జామను సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఒకే రకమైన పంటను అందరు సాగు చేస్తే మార్కెట్‌లో డిమాండ్ ఉండదని భావించిన ఆ రైతు ఆదాయాన్ని పెంచుకునేందుకు పంట మార్పిడికి శ్రీకారం చుట్టాడు. నర్మాలకు చెందిన బొంగు మల్లేశం ప్రైవేటు వైద్యుడిగా ప్రజలకు సేవ చేస్తూ, మరో వైపు తన వ్యవసాయ భూమిలో ఆరుతడి పంటలను సాగు చేస్తున్నాడు. తనకున్న ఎకరం పొలంలో టమాట, బీరకాయ, వంకాయ వంటి పలు రకాల కూరగాయలు సాగు చేస్తునే, తైవాన్ జామ సాగు చేస్తున్నాడు. దాదాపు 700 తైవాన్ జామ మొక్కలను ఖమ్మం జిల్లా అశ్వరావుపేట నుంచి తెచ్చి పెంచుతున్నాడు. ఒక్కో మొక్కకు 40 రూపాయలు చెల్లించి కొనుగోలు చేశాడు. ఎలాంటి రసాయనిక ఎరువుల వాడకం లేకుండా సేంద్రియ పద్ధతిలో తైవాన్ జామ సాగు చేస్తున్నాడు. పంట ఎదుగుదలకు కోళ్ల ఎరువు, పశువుల ఎరువు, జీవామృతం ఆర్గానిక్ పద్ధతిలో సాగుచేస్తున్నాడు. కోతులు, అడవి పందుల బెడద నుంచి పంటను కాపాడుకునేందుకు పొలం చుట్టు ముళ్లపొదను కంచె ఏర్పాటు చేసుకుని, జామ మొక్కలను స్పింకర్ల ద్వారా నీటి వసతి కల్పిస్తూ పంట సాగు చేస్తున్నాడు. నాటిన ఆరు నెలల్లో 400 చెట్ల వరకు కాతకు వచ్చాయి. ఒక్కో చెట్టు నుంచి 12 కిలోలకు పైగా దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో కిలోకు 70 రూపాయల ధర పలుకుతోంది.



నర్మాలలో తైవాన్ జామ తోట

● తైవాన్ జామకు భలే గిరాకీ

- బొంగు మల్లేశం, రైతు, నర్మాల



తైవాన్ జామకు మార్కెట్‌లో భలే గిరాకీ ఉంది. తైవాన్ జామతో అధిక లాభాలు ఉన్నాయి. జామతో పాటు కూరగాయలను కూడా సాగు చేస్తున్నా. నా తల్లిదండ్రుల సహకారం, ప్రోత్సాహంతో పంటలను సాగు చేస్తున్నా. గత ప్రభుత్వం సబ్సిడీపై స్పింకర్లు మాత్రమే ఇచ్చింది. డ్రిప్ పరికరాలను సొంతంగా కొనుగోలు చేశా. ప్రస్తుత ప్రభుత్వమైన సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ ఇస్తే తన పంటలకు రక్షణగా ఉంటుంది.

ఆసుపత్రి టీమ్‌కు ఎన్‌క్వాస్ షీల్డ్ అందజేత

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 18: వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి టీమ్‌కు కలెక్టర్ అనురాగ్ జయంతి ఎన్‌క్వాస్ షీల్డ్‌ను అందజేశారు. కలెక్టరేట్ సముదాయంలో ఆదివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేష్‌రావుతో పాటు సిబ్బందికి షీల్డ్‌ను అందజేశారు. రోగులకు అత్యుత్తమ, నాణ్యమైన వైద్య సేవలు అందించడం, ఆసుపత్రిలోని విభాగాలు మెరుగైన నిర్వహణకుగాను నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ సర్టిఫికెట్ రావడం అభినందనీయమని కలెక్టర్ బృందాన్ని అభినందించారు. వారి వెంట ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో రజిత, ఆఫీస్ సూపరింటెండెంట్ నాగరాజు తదితరులు ఉన్నారు.

పీడీ పోస్టుకు యువకుడి ఎంపిక



లింగంపల్లి రవి

రుద్రంగి, ఫిబ్రవరి 18: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి రవి యువకుడు గత ఏడాది ఆగస్టులో నిర్వహించిన గురుకుల టీచర్ పోటీ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాజన్న జోన్ (3 జోన్)లో పీడీ టీచర్ పోస్టుకు ఎంపికయ్యాడు. నిరుపేద కుటుంబానికి చెందిన లింగంపల్లి రవి కష్టపడి చదివి గురుకుల పీడీ టీచర్‌గా ఎంపిక కావటం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

గంభీరావుపేట, ఫిబ్రవరి 18: హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి కియో జపాన్ షాటోకాన్ కరాటే పోటీల్లో గంభీరావుపేట చెందిన మర్గాల బుచ్చిబాబు, ముద్రకోల అంజనేయులు అత్యంత ప్రతిభ కనబర్చి బ్లాక్ బెల్ట్‌లు సాధించారు. కియో జపాన్ షాటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో బుచ్చిబాబు 4వ డిగ్రీ, ముద్రకోల అంజనేయులు బ్లాక్ బెల్ట్ 1వ డిగ్రీ సాధించారు. నిర్వాహకులు జహింగీర్ బ్లాక్ బెల్ట్ 7వ డిగ్రీ ఆసియ జడ్జి చేతుల మీదుగా వీరిద్దరికి బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లను అందజేశారు.



సర్టిఫికెట్లతో బుచ్చిబాబు, అంజనేయులు

గుమ్మి పుల్లయ్య చేసిన పోరాటం మరువలేనిది

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 18: తెలంగాణ సాయుధ పోరాటంలో గుమ్మి పుల్లయ్య చేసిన పోరాటం మరువలేనిదని శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డులో భూమి పుల్లయ్య స్మారక స్తూపాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డితో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో పీడిత ప్రజలకు అండగా నిలిచిన గుమ్మి పుల్లయ్య స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. భావితరాలకు ఆయన ఆలోచన విధానం, పోరాటపటిమ ఈ స్తూపాన్ని చూసినప్పుడు ఒక స్ఫూర్తిగా ఉంటూ వారి అడుగుజాడల్లో నడవడానికి ఒక చిహ్నంగా ఉంటుందన్నారు. పేద ప్రజల హక్కుల కోసం, అణగారిన వర్గాల కోసం పోరాటం చేశారని కొనియాడారు. గుమ్మి పుల్లయ్య ఆలోచనలు ముందుకు తీసుకెళ్తూ పేద ప్రజల అభ్యున్నతికి కృషిచేస్తానని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, వేములవాడ పట్టణ కార్యదర్శి తెల్ల దేవరాజ్, గాజుల పోశెట్టి, శీలం నర్సయ్య, పంతం రవి, జిల్లా నాయకులు పెంట మల్లయ్య, కోరి క్రాంతి, కుమ్మరి కొమురయ్య శీలం నర్సయ్య, చక్రపాణి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగర వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, పాత సత్యలక్ష్మి, గుమ్మి పుల్లయ్య కుమారుడు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్తూపం ఆవిష్కరిస్తున్న ఆది శ్రీనివాస్, చాడ వెంకట్‌రెడ్డి

బతుకమ్మ చీరల ఆర్డర్లపై అసెంబ్లీలో కేటీఆర్ ప్రస్తావించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 18: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలు ప్రభుత్వ ఆర్డర్లపై ఆధారపడి మనుగడను కొనసాగిస్తుందని ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఈ సారి బతుకమ్మ చీరల అర్డర్లపై అసెంబ్లీలో సిరిసిల్ల ఎమ్మెల్యే మాజీ మంత్రి కేటీఆర్ ప్రస్తావించి అర్డర్లను ఇప్పించి కార్మికులకు ఉపాధి కల్పించేలా చూడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్ లోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే కేటీఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు ప్రభుత్వ అర్డర్లు రాకపోవడంతో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయని ఇప్పటికే 70 శాతం మరమగ్గాలు బంద్ పడి వేలాది మంది కార్మికులు ఆసాములు, పనులు లేక రోడ్డున పడ్డారని అన్నారు. వస్త్ర పరిశ్రమలు కొన్ని సంవత్సరాల నుంచి ప్రభుత్వ ఆర్డర్లపై ఆధారపడి పనిచేస్తున్నాయని అన్నారు. బతుకమ్మ చీరల అర్డర్లను ప్రతీ సంవత్సరం జనవరిలోనే ఇచ్చారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడిచినా ఇంతవరకు బతుకమ్మ చీరల ఆర్డర్లు రాలేదన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు వస్తాయో రావోననే ఆలోచనతో యజమానులు, ఆసాములు, కార్మికులు, ఆందోళన చెందుతున్నారని అన్నారు. వస్త్ర పరిశ్రమలకు ప్రైవేటు వస్త్రాల మార్కెటింగ్ లేకపోవడంతో పాటు యజమానులకు రావాల్సిన బతుకమ్మ చీరల బకాయిలు రూ 272 కోట్లు రావాల్సి ఉందన్నారు. పెట్టుబడులు లేక యజమానులు, పరిశ్రమలను బంద్ చేస్తున్నారన్నారు. సిరిసిల్లలో ఇంతటి క్లిష్ట పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ ఇక్కడి ఎమ్మెల్యే కేటీఆర్ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అసెంబ్లీలో ఇక్కడి సమస్యలను ప్రస్తావించడంతో పాటు పెండింగ్ బిల్లులతో పాటు ప్రభుత్వ ఆర్డర్లపై వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల సందర్భంగా వారానికి రెండు రోజులు సిరిసిల్లలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కేటీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని కేవలం ఓట్ల కోసమే తప్ప సమస్యల పరిష్కారం కోసం రావడం లేదన్నారు. ఇప్పటికైనా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభ పరిష్కారం కోసం సమస్యలను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, బెజుగం సురేష్, గడ్డం రాజశేఖర్, మోర తిరుపతి, బింగి సంపత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మూషం రమేష్

హస్తం గూటికి బీఆర్ఎస్ కౌన్సిలర్



పార్టీ కండువా కప్పుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 18: వేములవాడ పురపాలక సంఘం 22వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఇప్పపూల అజయ్ హస్తం గూటికి చేరారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇప్పపూల అజయ్ ఆదివారం నాడు రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వేములవాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక జరుగనున్న నేపథ్యంలో ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన మారం కుమార్ స్థానిక కౌన్సిలర్లతో కలిసి క్యాంపు నిర్వహించగా, సాంకేతిక కారణాల వల్ల ఎన్నిక వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కౌన్సిలర్లు హస్తం గూటికి చేరడానికి ప్రయత్నం చేస్తున్నారని ప్రచారం జరుగుతున్న తరుణంలో అనుహ్య రీతిలో 22వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ ఇప్పపూల అజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరడం చర్చనీయాంశంగా మారింది.

నల్లగొండ నర్సింహస్వామి ఉత్సవ కమిటీ నియామకం

కొడిమ్యాల, ఫిబ్రవరి 18: మండలంలోని నల్లగొండ గ్రామంలోని శ్రీలక్ష్మీన ర్సింహస్వామి ఉత్సవ కమిటీని ప్రభుత్వం నియామకం చేసినట్లు చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం ఆదివారం తెలిపారు. ఈ నెల 20 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న దృష్ట్యా ఉత్సవ కమిటీలో 13 మంది సభ్యులను నియామకం చేశామన్నారు. సభ్యులుగా చిలువేరి నారాయ ణగౌడ్, మ్యాకల మల్లేశం, దుబ్బాసి బుచ్చన్న, పురుమల్ల మనోహర్, ఇప్ప శ్రీనివాసరెడ్డి, బొమ్మరవేని తిరుపతి, వన్నెల రమణారెడ్డి, మొగిలి నర్సయ్య, కడారి మల్లేశం, బత్తిని శ్రీనివాసగౌడ్, కొత్తపెల్లి దిలీప్‌కుమార్, భీంరెడ్డి మహే శ్వర్‌రెడ్డి. దొంగ ఆనందరెడ్డిలను ఉత్సవ కమిటీ సభ్యులుగా నియామకం చేసినట్లు ఎమ్మెల్యే ప్రకటించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ముస్తాబాద్, ఫిబ్రవరి 18: ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని పాఠశాలలో 2001-2002లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఒక్కచోట చేరి కలుసుకున్నారు. పలు పనులు, వృత్తిరీత్యా హైదరాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, బెంగుళూరు వంటి పలు పట్టణాల్లో స్థిరపడిన అప్పటి విద్యార్థులు గత స్మృతులను స్మరించుకున్నారు. నాటి విద్యా విధానంపై చర్చించారు. గురువులను శాలువతో సత్కరించి మెమొంటో అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చెల్లపూరం మహేందర్, అరుట్ల తిరుపతిరెడ్డి, బండారి యాదగిరి, కొత్తపెల్లి దేవిక, చెవుల రజిని, బద్దిపడిగె భాగ్యశ్రీ, గౌడ కరుణశ్రీ, ఇందిర, యాకూబ్, ఎద్దండి వెంకట్‌రెడ్డి, శ్రీమతి, అక్కరాజు మహేశ్, యాదగిరి, దేవరాజురెడ్డి, తాజ్‌గౌడ్, తాళ్ల మహేశ్, అనమేని ప్రవీణ్, షాదుల్, అరుణ్, గుండెపల్లి స్వామిగౌడ్ పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కల్యాణం.. కమనీయం

- నేత్రపర్వంగా శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వర, లక్ష్మీనారాయణుల కల్యాణం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 18: మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి, లక్ష్మీనారాయణస్వామి కల్యాణాలను ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో తిరుమల నుంచి తెప్పించిన 15 వేల లడ్డూలను భక్తులకు వితరణ చేశారు. అనంతరం అన్నదానం జరిగింది. ఉమ్మడి జిల్లా నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని కనులారా తిలకించి పులకించి పోయారు. భక్తజనంతో కల్యాణ వేదికతోపాటు ఆలయ మాడ వీధులు కిక్కిరిసిపోయాయి. మంత్రి పొన్నం ప్రభాకర్-మంజుల దంపతులు, కుటుంబ సభ్యులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి స్వామి వారల తరపున ప్రతినిధులుగా వ్యవహరించగా శ్రీదేవి, భూదేవి, లక్ష్మీ అమ్మవార్ల తరఫున కన్యాదాతలుగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈఓ వుడుతల వెంకన్న వ్యవహరించి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ దంపతులు, ఆర్డీవో మహేశ్వర్, ఏసీపీ నరేందర్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ పురుమల్ల శ్రీనివాస్, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కటకం వేంకటరమణ, నార్ల కార్తిక్, పొన్నం అశోక్‌గౌడ్, పొన్నం రవిచంద్ర పాల్గొన్నారు.

● ఆకట్టుకున్న కల్యాణ ప్రక్రియ...

వేదికపై అర్చకులు నిర్వహించిన కల్యాణ ప్రక్రియ భక్తులను ఆకట్టుకుంది. అమ్మవార్లు, స్వామివారల గుణగణాలు, కల్యాణం గొప్పతనంపై సంభాషణ, వారణమాయిరమ్, పూబంతులాట, మాలా మార్పిడి నృత్యం, వేదమంత్రాలు, వివిధ అలంకరణలు అలరింపజేశాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ కల్యాణం ఆసాంతం జరుగుతున్న వైదిక ప్రక్రియను మంత్రి తిలకించి ఉత్సవంతో మమేకమయ్యారు. మాలామార్పిడి నృత్యం, పూబంతులాట ఆడారు. మంత్రి ప్రత్యేకంగా వేదపండితులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కలెక్టర్ పమేలా సత్పతి తదితరుల గోత్రనామాదులను పఠింపజేశారు. కల్యాణంలో సల్వాజీ ప్రవీణ్ బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు, సాయంత్రం సంగీత కచేరీలు, నృత్యప్రదర్శనలు, పాటలు భక్తిసాగరంలో ఓలలాడించాయి. ఆదివారం రాత్రి ఆలయ మాడ వీధుల్లో జరిగిన గరుడవాహనసేవలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు

● భారీ బందోబస్తు

కల్యాణోత్సవం సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రే ఆలయ మాడ వీధుల వద్ద వాహనాలను అనుమతించలేదు. ఆలయం లోపల ఎక్కడికక్కడ ఇనుప బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. వేదిక వద్ద అర్చకులు, నిర్వాహకులు, సిబ్బంది, నాయకులు, ముఖ్యులను తప్ప ఇతరులను అనుమతించలేదు. ఆలయం చుట్టూ వివిధ మార్గాలు ఏర్పాటు చేసి భోజనాలకు, ప్రసాద స్వీకరణకు పంపించారు. బందోబస్తు ఏర్పాట్లను ఏఈపీ నరేందర్ పర్యవేక్షించారు.

● టీటీడి నుంచి పట్టు వస్త్రాలు-ప్రసాదం అందజేత

శ్రీనివాస కల్యాణం సందర్భంగా రాత్రి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హోదాలో పేష్కార్ పి శ్రీహరి బృందం టీటీడి నుంచి పట్టు వస్త్రాలు-ప్రసాదం, మాలలు, పండ్లు, పూలు ఆలయానికి తీసుకొని వచ్చారు. బృందానికి ఆలయ వ్యవస్థాపక వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో ఉడుతల వెన్న స్వాగతం పలికి గర్భాలయంలో శ్రీవారికి సమర్పింపజేశారు.

మేడారం వెళ్లే మహిళా భక్తులకు ఉచిత ప్రయాణం

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత

భగత్‌నగర్, ఫిబ్రవరి 18: మేడారం సమ్మక్క జాతరకు మహిళా భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తోందని టీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత అన్నారు. కరీంనగర్ బస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మేడారం సమ్మక్క సారలమ్మ జాత క్యాంపును ఆమె ఆదివారం ప్రారంభించారు. మేడారం ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ వరకు మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చలువ పందిళ్లు, క్యూ రెయిలింగ్స్, తాగునీటి వసతి, వైద్య, సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మేడారం వెళ్లే భక్తులు ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించి సమ్మక్క సారలమ్మ దేవతలను దర్శించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, డిప్యూటీ రీజినల్‌మేనేజర్ (మెకానికల్) కె సత్యనారాయణ, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లు ఎల్ మల్లేశం, వి మల్లయ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న అధికారులు